

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నిజాంసాగర్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగి, గోర్గల్ వడ్డేపల్లి గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే భాగంగా సూపర్ చెక్ ఐదు శాతం సర్వేను నిర్వహించారు. గ్రామాలలో ఇల్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లలో సర్వే ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయనవెంట పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

నకిలీ డాక్టర్ అరెస్టు

- జిల్లాలో రెండేళ్లుగా పిల్లల వైద్యుడిగా చెలామణి
- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు : ఏఎస్పీ చైతన్యరెడ్డి



పోలీసులు అరెస్ట్ చేసిన నకిలీ వైద్యుడు రవీందర్

కామారెడ్డి టౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని స్టార్ ఆసుపత్రిలో చిన్నపిల్లల డాక్టర్‌గా సేవలు అందిస్తున్న నకిలీ డాక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం కామారెడ్డి పీఎస్‌లో ఆమె కేసు వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన ముల్కల రవీందర్ అనే నకిలీ వైద్యుడు కామారెడ్డి జిల్లాలో చిన్నపిల్లల డాక్టర్‌గా గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడని తెలిపారు. గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నట్లుగానే ఇంట్లో వారిని నమ్మించి, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసి తన పేరుకు దగ్గరగా ఉన్న హైదరాబాద్‌లో పనిచేసే రవీందర్‌రెడ్డి అనే ఓ వైద్యుడి సర్టిఫికెట్‌లను మార్ఫింగ్ చేసి ఫేక్ వైద్య అర్హత సర్టిఫికెట్లను సృష్టించినట్లు వివరించారు. రవీందర్ రెడ్డిగా ఆధార్‌కార్డు సైతం మార్చడని తెలిపారు. జిల్లాకేంద్రంలో 2023 నుంచి 2024 వరకు పలు ఆసుపత్రిలో పనిచేశాడని చెప్పారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో షణ్ముఖ ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా పనిచేసేందుకు రూ.2లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని ఒప్పందం కుదుర్చుకున్నాడని, సదరు నకిలీ వైద్యుడి లీలలు తెలుసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దండెం లాలయ్య కామారెడ్డిలో రవీందర్ అనే నకిలీ వైద్యుడు వైద్యం అందిస్తున్నాడని బుధవారం ఫిర్యాదు చేశారని తెలిపారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టగా.. అప్పటికే రవీందర్ పరారీలో ఉండడంతో గాలించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. విచారణలో రవీందర్ డిగ్రీ కూడా పాస్ కాలేదని, ఆర్ఎంపీ వైద్యుడు వద్ద చికిత్సకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించి వైద్యుడిగా చెలామణి అవుతున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి ఫేక్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఒక ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

- జిల్లాలో విచ్చలవిడిగా అరువు వైద్యులతో ఆసుపత్రుల నిర్వహణ
- అసలు, నకిలీ వైద్యులెవరో తెలియని పరిస్థితి
- అడ్డగోలుగా చికిత్సలు.. నకిలీ వ్యవహారం బయటపడగానే పరారీ
- గతంలో బాన్సువాడలో.. నేడు కామారెడ్డిలో నకిలీ వైద్యుడి గుర్తింపు
- అరువు వైద్యులతోనే ఈ తంటాలు వస్తున్నాయంటూ ఆరోపణలు
- నెలవారీగా ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న వైద్యఆరోగ్య శాఖ
- తనిఖీల్లో నకిలీ వైద్యులను గుర్తించని స్థితిలో అధికారులు
- నిలువునా మోసపోతున్న రోగులు

నకిలీ వైద్యుల కలకలం!





నకిలీ సర్టిఫికెట్లను చూపుతున్న సీఐ

కామారెడ్డిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ వైద్యుల చికిత్సలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఎవరు అసలు వైద్యుడో.. ఎవరు నకిలీ వైద్యుడో తెలువని పరిస్థితి ప్రజలకు ఏర్పడుతోంది. ప్రజా ఆరోగ్యం కంటే వ్యాపారమే ధ్యేయంగా ఇష్టారీతిన ఆసుపత్రులను ఏర్పాటు చేస్తూ అరువు వైద్యులను తీసుకుని వచ్చి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. చికిత్సకు ఇంత అంటూ ప్యాకేజీలు మాట్లాడుకుని తీసుకువస్తున్న అరువు వైద్యులతోనే ఇలాంటి తంటాలు వస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అరువు వైద్యులలో ఎవరికి డాక్టర్ పట్టా ఉందో.. ఎవరికి లేదో అనేది వైద్యఆరోగ్యశాఖ గుర్తించకపోవడంతో ఎవరికి నచ్చినట్లుగా వారు ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత రెండేళ్లుగా ఇలాంటి అరువు వైద్యుడిగా వచ్చిన నకిలీ వైద్యుడే చికిత్సలు అందిస్తూ వచ్చాడు. పైగా చిన్నపిల్లల వైద్యుడిగా చికిత్సలు అందించడం గమనార్హం. అభంశుభం తెలియని చిన్నారులకు తాను చికిత్స అందిస్తున్నానని, వారికి ఏదైనా జరగరానిది జరిగితే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎంటనే కనీస జ్ఞానం లేకుండా వైద్యచికిత్సలు అందించిన నకిలీ వైద్యుడి గుట్టును తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బయటకు తీసింది. పోలీసులకు సదరు వైద్యుడి లీలలపై ఫిర్యాదు చేయడంతో అతనిని అరెస్ట్‌చేశారు.

• నకిలీ వైద్యుడి అరెస్టు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టార్ ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యుడి (ఎంబీబీఎస్, ఎండీ, జనరల్ మెడిసిన్, షుగర్ వ్యాధి నిపుణులు)గా చెలామణి అవుతూ వైద్యచికిత్సలు అందిస్తున్న నకిలీ డాక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. గురువారం కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నకిలీ డాక్టర్ గురించి పలు విషయాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన ముల్కల రవీందర్ అనే నకిలీ వైద్యుడు కామారెడ్డి జిల్లాలో చిన్నపిల్లల వైద్యుడిగా గత రెండేళ్ల కాలంగా పనిచేస్తున్నాడని తెలిపారు. హైదరాబాద్‌లో పనిచేసే రవీందర్‌రెడ్డి అనే వైద్యుడి సర్టిఫికెట్‌లను మార్ఫింగ్ చేసి ఫేక్ వైద్య అర్హత సర్టిఫికెట్లను సృష్టించినట్లు చెప్పారు. జిల్లాకేంద్రంలో 2023 మార్చి నుంచి జూలై 2023 వరకు, ఆగస్టు 2023 నుంచి జనవరి 2024 వరకు ఆరోగ్య ఆసుపత్రిలో, ఫిబ్రవరి 2024 నుంచి జూలై 2024 వరకు లింగంపేటలోని భీమరాజు ఆసుపత్రిలో, ఆతర్వాత తిరిగి 2024 ఆగస్టు నుంచి 2024 డిసెంబరు వరకు స్టార్ ఆసుపత్రిలో పనిచేశాడని తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దండెం లాలయ్య ఫిర్యాదుతో నకిలీ డాక్టర్ బండారం బయటపడినట్లు వెల్లడించారు.

• పలుచోట్ల నకిలీ వైద్యుల గుర్తింపు

జిల్లాలో నకిలీ వైద్యులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. గతంలో బాన్సువాడలో సైతం నకిలి వైద్యచికిత్సలు అందిస్తున్నవారిని అరెస్ట్‌చేసి కటకటాలలోకి నెట్టారు. ప్రస్తుతం కామారెడ్డిలోను చిన్నపిల్లల వైద్యుడిగా కొనసాగుతున్న వైద్యచికిత్సలు అందిస్తున్న నకిలి వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మంది నకిలి వైద్యులు ఉన్నట్లు ఎన్ఎంసీ తనిఖీలలో బట్టబయలు అయింది.దీంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి జైలుకు సైతం పంపించారు. జిల్లాలో కొందరు మెడికల్ రిప్‌లు, ఆర్ఎంపీ, పీఎంపీలు, మెడికల్ దుకాణాల నిర్వాహకులు ఇష్టారీతిన అరువుకు వైద్యులను తీసుకుని వచ్చి ఆసుపత్రులను నెలకొల్పుతున్నారు. వారికి కన్సల్టెన్సీకి ఇంతా.. చికిత్సకు ఇంతా అంటూ బేరమాడుకుంటూ వైద్యవ్యాపారం చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే నెలల వ్యవధి వరకే చికిత్సలు అందించి నకిలీ వ్యాపారం బయట పడగానే ముందు జాగ్రత్త చర్యగా ఇక్కడి నుంచి బిచనా సర్దేస్తున్నారు. వారి స్థానంలో మరో వైద్యుడిని తీసుకువచ్చి వ్యాపారం సాగిస్తున్న యాజమాన్యాలు అసలు అతను నిపుణుడైన వైద్యుడి లేదంటే నకిలి వైద్యుడా అనేది గుర్తించకుండా కేవలం ధనర్జనే ధ్యేయంగా వైద్యచికిత్సలు అందించేలా చూస్తున్నారు. ఇలా జిల్లాలో చాలాచోట్ల ఇలాంటి నకిలీ వైద్యులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అరువు వైద్యులతోనే ఈ తంటాలు వస్తున్నాయంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా ఆసుపత్రులలో చికిత్సలు అందిస్తున్న వైద్యుల సర్టిఫికెట్లను పరిశీలిస్తే మరింత మంది బయటపడే అవకాశం

(తరువాయి 6వ పేజీలో..)





మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం సుధాకర్

డ్వాక్రా సంఘాలకు రూ. 613.71 కోట్ల రుణాలు

- ఐకేపీ డీపీఎం సుధాకర్

నాగిరెడ్డిపేట, జనవరి9 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు జిల్లాలో డ్వాక్రా సంఘాలకు రూ.613.71 కోట్ల రుణాలు అందజేసినట్టు ఐకేపీ డీపీఎం సుధాకర్ తెలిపారు. ఆయన గురువారం నాగిరెడ్డిపేటలో ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల సమైక్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 17,058 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో లక్షా 78వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోనీ డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా 802 కోట్ల రూపాయలు రుణాలు అందించే లక్ష్యం కాగా, ఇప్పటివరకు 9035 డ్వాక్రా సంఘాలకు 613 కోట్ల 71 లక్షల రూపాయల రుణాలను అందజేసినట్టు ఆయన తెలిపారు. బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు సక్రమంగా రుణాలను చెల్లించాలని ఆయన మహిళలను కోరారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే డ్వాక్రా మహిళలను పారిశ్రామిక శ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం గ్రామ మహిళా డ్వాక్రా సంఘాలు, మండల సమాఖ్యల ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాలలో సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలో విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు కోసం 150 ఎకరాలలో భూసేకరణ జరుగుతుందని, ఒక్కో సోలార్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం నాలుగు ఎకరాల స్థలం అవసరమై ఉందన్నారు. ఒక్కో సోలార్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం 3 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను, ఎండోమెంట్ భూములను, ఇరిగేషన్ భూములను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం జగదీష్ కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదరం క్యాంప్‌లకు హాజరైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు, నాలుగు సంవత్సరాల కాలానికి ఇచ్చే సదరం సర్టిఫికెట్ కోసం మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు లేఖలు రాస్తామని తెలిపారు. దివ్యాంగుల సమస్యలపై దరఖాస్తులను ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమర్పించవచ్చని చెప్పారు. ఆర్టీసీ బస్సులో ప్రత్యేకంగా సీట్ల కేటాయింపు విషయంలో డీపో మేనేజర్‌లతో చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు. దివ్యాంగులకు స్వయం సహాయక గ్రూప్‌లు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో నడిచే విధంగా చర్యలు తీసుకుని రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. అదేవిధంగా ఉపాధిహామీ పథకం కింద 150 రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులకు పోస్టల్‌శాఖ ద్వారా కాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించేందుకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుల్లో 5 శాతం కేటాయించాలని కోరిన మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. రైల్వే పాసుల విషయంలో రైల్వే అథారిటీకి లేఖలు రాస్తామని తెలిపారు. అలీంకో వారిచే క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి కార్యాలయంలో ర్యాంపు నిర్మించే విధంగా ఆదేశాలు జారీచేస్తామని తెలిపారు.అనంతరం టీఎన్‌జీవోస్, రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ముగ్గుల పోటీలను పరిశీలించారు. మొదటి బహుమతి గెలిచిన ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వీణ, స్రవంతి, బీసీ వెల్ఫర్ డిపార్ట్‌మెంట్ కుచెందిన సౌమ్యజమున, పోస్టల్ శాఖకు చెందిన ప్రియాంక తదితరులకు బహుమతులు అందించారు. మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందుండి జిల్లా కార్యాలయాల్లో వారి పనులను సంతృప్తికరంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సంక్షేమాధికారి ప్రమీల, జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సహఅధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యాక్షుడు సాయిలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో మృతిచెందిన శిశువు

కామారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం తెల్లవారు జామున ఓ పసికందు మృతిచెందింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతిచెందిందని బంధువులు ఆందోళనకు దిగారు. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన భవానికి బుధవారం మధ్యాహ్నం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆమెను జిల్లాకేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మొదటి కాన్పు కావడంతో ఆమెను పరిక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం కోసం వేచి చూశారు. నొప్పులు ఎక్కువ కావడంతో గురువారం తెల్లవారు జామున ఆపరేషన్ చేశారు. ఆడబిడ్డ పుట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతిచెందిందని కుటుంబీకులు, బంధువులు వైద్యసిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాము కోరినట్లుగా ఆపరేషన్ చేసి ఉంటే బిడ్డ బతికేదని, వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న శిశువు బంధువులు

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్నిర్మాణం అయ్యేనా?

- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- రూ.3.50 కోట్ల నిధుల మంజూరు హుళక్కేనా?
- శిథిలావస్థలో నర్సరీలు, కార్యాలయ భవనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

నిజాంసాగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్నీర్మాణం కోసం అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా 11ఎకరాల భూమిలో 1956లో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ ఉత్పత్తి కేంద్రం, రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. కానీ పాలకుల నిర్లక్ష్యవైఖరి కారణంగా కాలక్రమేనా ఉత్పత్తి కేంద్రం శిథిలావస్థకు చేరి కళాహీనంగా మారింది. ఉత్పత్తి కేంద్రంలో చిరు చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు అప్పట్లో దాదాపు 50 సిమెంట్ నర్సరీలు నాలుగు మట్టి చెరువుల నిర్మాణం చేశారు. ఈచెరువుల్లో తల్లి చేపలు పెంచుతూ ఉండేవారు. చిరు చేప పిల్లలను నర్సరీలో పెంచేవారు. ఈ కేంద్రం 1956 నుంచి 1986, 1987 సంవత్సరం వరకు ఆర్భాటంగా నిర్వహణ చేసిన అధికారులు కాలక్రమేనా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంపై నిర్లక్ష్యం చేశారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేపపిల్లలను బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని చెరువుకుంటల్లో మత్స్య కార్మికుల ఉద్ధరణ కోసం విడుదల చేసేవారు. ఉత్పత్తి కేంద్రంలో నర్సరీలు శిథిలావస్థకు చేరుకోగా మట్టి చెరువులు కళాహీనంగా మారడంతో చేప పిల్లల ఉత్పత్తికి అధికార యంత్రాంగం స్వస్తి పలికింది. ఈ కేంద్రంలోని కార్యాలయ భవనాలు ఆనాడు కనువిందు చేసే విధంగా ఉండేవి.



శిథిలావస్థకు చేరిన కార్యాలయం ఇదే..



చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సిమెంట్ నర్సరీలు ఇవే..

కేంద్రంలో కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఈ ఉత్పత్తి కేంద్రానికి పునర్నీర్మాణం చేసేందుకు రూ.3కోట్ల 50లక్షల ప్రతిపాదనలు రూపొందించింది. అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఈ నిధుల మంజూరుకు నోచుకోలేదు. చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఉన్నా చేప పిల్లలఉత్పత్తి జరగకపోవడంపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఉత్పత్తి కేంద్రంపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నా..

(తరువాయి 6వ పేజీలో..)

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

కామారెడ్డి - ఎల్లారెడ్డి

90322 16482

అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్ : 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

ఫటా..ఫట్...

సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

● డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్



ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: మండలంలోని అన్ని గ్రామాల్లో సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజల్లో పోలీసుల కళాజాత బృందాల ద్వార విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నం. పోలీసులు ఎక్కడ కూడా సైబర్ సోలకు పాల్పడే ఆస్కారం ఉండదని నేరగాళ్లు పోలీసుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఈ విషయంలో ప్రజలకు అవగహన కల్పిస్తున్నమన్నారు.

ఆంధ్రజ్యోతి: ఇటీవల పెరిగిన సైబర్ నేరాలను ఏలా నియంత్రిస్తారు?

ఎస్సై: గుర్తు తెలియని ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దు అలాంటి ఫోన్ లు అనుమానం ఉంటే 1930 నంబర్ కు కాల్ చేయాలి

ఆంధ్రజ్యోతి: రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా?

ఎస్సై: అర్ధరాత్రి వేళ ముమ్మరంగా దిచక్రవాహనలతో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తున్నాం. గత రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు మెకానిక్ షాపు నుంచి ఎత్తికెళ్లడంతో పిర్యాదు వచ్చింది ముమ్మరంగా గాలింపు చేపట్టి చోరీకి గురైన రెండు వాహనాలను స్వాధినం చేసుకున్నం.

ఆంధ్రజ్యోతి: పోలీసులకు గ్రామీణ ప్రజలు సహకారం ఏలా ఉంది

ఎస్సై: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారు. పోలీసులకు ప్రజలు, సహకరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

● (ఆంధ్రజ్యోతి,డిచ్‌పల్లి

విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● ఇంటర్ అకాడమిక్ స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న



భీమ్‌గల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న దాసరి ఒడ్డెన్న

భీమ్‌గల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఇంటర్ అకాడమిక్ స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న దాసరి ఒడ్డెన్న లెక్చరర్‌లకు సూచించారు. గురు వారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థులను పలు విషయాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధనలో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్ళి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూ చించారు. అంతేగాకుండా ప్రాక్టికల్‌కు సంబంధించిన అన్ని రకాల విషయాలపై సైన్స్ అధ్యాపకులను ప్రశ్నించి వారి వద్ద నుంచి సమాధానాలను అడిగితెలుసుకున్నారు. కళాశాల విద్యార్థుల రిజిష్టర్ లను టీచింగ్ డైరీలను తనిఖీ చేశారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, లెక్చరర్‌లో ఉన్నారు.

మోర్తాడ్: కళాశాల విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులుకు, అధ్యాపకులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఇంటర్ అకాడమిక్ స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న దాసరి ఒడ్డెన్న సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.గంగాధర్‌లు డీఐఈవో దాసరి ఒడ్డెన్నను శాలువతో సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో రేణుక

వేల్పూర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): పిల్లలు ప్రాథమిక స్థాయి నుంచి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మండల విద్యాధికారిణి రేణుక సూచించారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రాథమిక పాఠశాలల క్రీడలను ఎంఈవో రేణుక ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని, ఓడిన వారు ముున్ముందు గెలుపు కోసం సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



డొంకేశ్వర్‌లో పీఆర్‌టీయు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

డొంకేశ్వర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయు 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం పీఆర్‌టీయు ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధానకార్యదర్శి రాంరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్, సాయికుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఐఎన్‌టీయుసీ 327యూనియన్ నూతన క్యాలెండర్, డైరీని విద్యుత్ డీఈ రాజేశ్వర్, ఏడీఈ కృష్ణ, శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మోహన్, ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్, కార్యదర్శి చందర్ నాయక్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బీరు బాటిళ్లలో చెత్త ప్రత్యక్షం



కోటగిరి,జనవరి9(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని వైన్స్‌లో ఓ వ్యక్తి బీరు బాటిల్ కొనుగోలు చేసి తాగే సమయంలో బాటిల్‌లో చెత్తచెదారం, మలినాలు ఉండడంతో అవాక్కయ్యాడు. గ్రామానికి చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తి స్థానిక వైన్స్‌లో బీరు బాటిల్ కొనుగోలు చేశాడు. బీరును తాగగా విరేచనాలకు గురయ్యాడు. బాటిల్‌ను పరిశీలించి చూడగా చెత్త, మలినాలు ఉండడంతో వైన్స్ వద్దకు వెళ్లి నిర్వాహకులను నిలదీశాడు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఎక్సైజ్ అధికారులు బీరు బాటిల్‌ను పరిశీలించి ల్యాబ్‌కు పంపిస్తామని సమాధానం ఇచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మద్యం దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తాం

● సబ్ కలెక్టర్ వికాస్ మహతో



ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎడపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ వల్ల వచ్చిన రైతుల భూసమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం ఎడపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కొందరు రైతుల పట్టా భూములు ధరణిలోఎస్‌ఎస్‌ఎఫ్ భూములుగా చూయించడంతో వారు సబ్ కలెక్టర్‌కు తమ సమస్యలను విన్నవించుకున్నారు. మండల కేంద్రంలో చాలా మంది రైతుల స్వంత పట్టా భూములు ధరణి పోర్టల్‌లో ఎస్‌ఎస్‌ఎఫ్ భూములుగా చూపిస్తున్నారని, ఎడపల్లి మండల కేంద్రంలో సర్వే నంబర్లు 500 నుండి 600వరకు మంగల్‌పాడ్ రోడ్డులో పట్టా భూములు ఉన్నాయని, అదే సర్వే నంబర్లతో ఏఆర్పీ క్యాంపు గ్రామం ఏరియాలో ఎస్‌ఎస్‌ఎఫ్ భూములు కూడా ఉన్నాయని, వాటికి గతంలో వేర్వేరు మాన్యువల్ పహాణీలు ఉండేవని, ధరణి పోర్టల్ తీసుకు వచ్చిన తరువాత రెండు భూములను ఒకే దగ్గర ఆన్‌లైన్ చేయడంతో పట్టా భూములు కూడా ఎస్‌ఎస్‌ఎఫ్ భూములుగా చూపిస్తున్నారని, అధికారులు చేసిన తప్పిదం వల్ల మేము ఇబ్బందులు పడుతున్నామని వారు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ధరణిలో ఎస్‌ఎస్‌ఎఫ్ భూములుగా చూయించడంతో వారసత్వ మార్పిడీ పట్టాలు, అమ్మకాలు, కొనుగోలు చేయడం లేదని వారు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే ఆయన ఎస్‌ఎస్‌ఎఫ్ భూములు కానివాటిని వారసత్వ పట్టా మార్పిడి చేయాలని, ఎస్‌ఎస్‌ఎఫ్ భూములు కానివి ఎందుకు ఆపుతున్నారని తహసీల్దార్‌ను వివరణ కోరగా ధరణిలో ఆ భూములు ఎస్‌ఎస్‌ఎఫ్ భూములుగా చూపడంతో అట్టి భూముల లావాదేవీలను ఆపి వేశామని, ఎస్‌ఎస్‌ఎఫ్ కోర్ కమిటీ నుండి అట్టి భూములపై వివరణ పత్రం సమర్పిస్తే మార్పిడి చేస్తామని తహసీల్దార్ ధన్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు విశ్వనాథ్, ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్ తదితరులు ఉన్నారు.

● కాంగ్రెస్ సర్కార్‌తో అన్నదాతలకు తీరని అన్యాయం

బోధన్‌రూరల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్‌తో అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతుందని, రైతులకు ఎన్నికలలో హామీని ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో రైతు భరోసా పథకం విషయంలో మాట మార్చిన ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు పంట పెట్టుబడి సహాయంగా రైతు భరోసా పథకాన్ని గత ప్రభుత్వం అమలు పర్చిన రైతుబంధు పథకానికి కొనసాగింపుగా రైతు భరోసా పేరుతో ఎకరానికి 7500రూపాయల చొప్పున యేడాది 15వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు మాట మార్చిందన్నారు. కౌలు రైతులకు, కూలీలకు కూడా పెట్టుబడి ఇస్తామని ప్రభుత్వం మాట మార్చిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్; మండల అధ్యక్షులు సంజీవ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, శంకర్ గౌడ్, బెంజరి గంగారాం, నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలి

మాక్లూర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల సంఘం వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాదవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రధానకార్యదర్శి జైశెట్టి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బోర్గం(కె) గ్రామంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెపాటి మాదవరావు సంస్మరణ సభ ఈనెల 11జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ఆయన నివాసం వద్ద సభను నిర్వహిస్తారని, అట్టి సభకు విజయవంతం చేసి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, గంగాధర్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, జైశెట్టి రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఐఎఫ్‌టీయు, అరుణోదయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మానవహక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్‌నాయకుడు గొర్రెపాటి మాదవరావు సంస్మరణ సభ వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మాదవరావు మరణం శ్రామికవర్గానికి తీరని లోటని, ఈనెల 11న జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మలో నిర్వహించే సంస్మరణ సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షుడు జి.సూర్యశివాజీ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు వి.సూరిబాబు, వర్దరెడ్డి, అబ్దుల్, ప్రిన్స్ వాజిద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



బోర్గాంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి: మహోన్నతమైన మేథశక్తి గొర్రెపాటి మాధవరావు అని ఆయనను కోల్పోవడం ప్రజా ఉద్యమాలకు తీరాని లోటు అని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్, అన్నార. ఈ సందర్భంగా ఘన్‌పూర్ లో మాధవరావు సంస్మరణ సభ పోస్టర్ లను పీవైఎల్ నాయకులు ఆవిష్కరించారు.ఈ నెల 11న జరిగే సంస్మరణ సభ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు రజిత, శైలజ, లాస్య, సృజన, భూదేవి, లక్ష్మీ, జమున పాల్గొన్నారు.

బోర్గాంలో నవజాత శిశువు మృతదేహం లభ్యం

రెంజల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం గ్రామంలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఎస్ఐ సాయన్న, స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోర్గాం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన శంకర్ అనే వ్యక్తి ఇంటి ముందు సోయాబీన్ కుప్ప వద్ద గురువారం ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో నవజాత శిశువు మృతదేహాన్ని తీసుకువచ్చి పడేయడంతో గమనించిన స్థానికులు పంచాయతీ కార్యదర్శి రాణితో ఎస్ఐ సాయన్నకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పంచాయతీ కార్యదర్శి రాణి, ఎస్ఐ సాయన్న చేరుకుని శిశువు మృతదేహన్ని పరిశీలించారు. నవజాత శిశువు మృతదేహన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నవజాత శిశువు మృతదేహన్ని కుక్కలు తీసుకువచ్చి పడేయడంతో అక్కడున్న స్థానికులు హృదాయవిదాకర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.నవజాత శిశువు కుక్కలపాలు కావడంతో స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.పదిరోజులు గడవని శిశువు మృతదేహం కనిపించడంతో ప్రజలందరు విచారం వ్యక్తంచేశారు.

చికిత్స పొందుతూ బాలికల మృతి

డొంకేశ్వర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక మనస్థాపం చెందిన ఈనెల 5న ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ఆ బాలిక 5వ తేదీన ఇంటి నుంచి కాలకృత్యాలు తీసుకోవడానికి బయటకు వెళ్ళింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి ఆ బాలికలు ఫోటోలు తీయడానికి యత్నించాడు. దీంతో మనస్థాపం చెందిన ఆ బాలిక ఇంట్లో వ్యవసాయ కోసం తీసుకువచ్చిన గడ్డి మందు తీసుకొని తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలిక మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వణికిస్తున్న చలిపులి!

● అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

మద్నూర్,జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం 7 గంటలైన చలి తీవ్రత తగ్గడం లేదు. గత మూడు రోజులుగా చలి పెరిగిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు వస్తే చలిగాలిని పీల్చడ ంతో ప్రతి ఒక్కరికి విపరీతమైన జలుబు, తుమ్ములు, దగ్గు తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో అత్యధికంగా చలిగాలులు వీస్తున్నాయి. రోజు అత్యధిక ఉష్ణోగ్రతలు 20 నుంచి 25 డిగ్రీలు నమోదు కాగా అత్యల్పంగా 10 నుంచి 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. యువతి యువకులు చలిని తట్టుకునేందుకు స్వెటర్లు ధరిస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని పెద్ద కొడప్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎంఆర్‌ఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, సంజీవ్, పండరి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన ఆలయం

మద్నూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటలకు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో భక్తుల కోసం ఏరాటు చేశారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని అన్ని దేవాలయాల్లో ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి అన్ని ఏకాదశిలలో అత్యంత పవిత్రమైనది. ఈరోజున ఉపవాసం ఉండి శ్రీ మహావిష్ణువును ద్వార దర్శనం చేసుకుంటారు. దీనిని వైకుంఠ ద్వార దర్శనం అని కూడా అంటారు. వైకుంఠం అంటే విష్ణు నివాసం అని అర్థం.పురాణ కాలం నుంచి వైకుంఠ ద్వార దర్శనాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే సాయంత్రం వరకు ఆలయాలను భక్తితో భక్తులు దర్శించుకోనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఎల్లారెడ్డి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీ పూర్ గ్రామానికి చెందిన సాతెల్లి కిష్టయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయనతోపాటు మాజీ జడ్పీటీసీ ఉషా గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, నాయకులు సాయిలు, హనుమంతు, చిరంజీవి, పెంటయ్య, భూమారెడ్డి, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పడిగెలలో జొన్న పంట పరిశీలన

వేల్పూర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో సాగవుతున్న వివిధ పంటలను మండల వ్యవసాయాధికారిణి ఎస్.శృతితో పాటు ఏఈవోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో శృతి మాట్లాడుతూ రైతులు యాసంగిలో జొన్న పంటలో వచ్చే వివిధ పురుగులను, వాతావరణ దృష్ట్యా జొన్న పంటలో పేనుబంక అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుగు యొక్క ఉధృతి అడుగుభాగంలో ఉండి రసాయాన్ని పీలుస్తుందన్నారు. తెగులు సోకిన మొక్కలు లేత పసుపు రంగులోకి మారి కుంగిపోతాయన్నారు. మొక్కలపై తేనే మంచు, చీమలు ఉండడం, అఫిడ్స్‌కు సూచన అన్నారు. ఇదీ చాలా గడ్డిలో కూడా సంభవిస్తుందన్నారు. పేనుబంక నివారణకు ట్రిఫోనిల్ రెండు మిల్లీలీటర్లు, థయామెథాక్సామ్ 0.2గ్రాములు, ఫ్లోనికామిడ్ 0.3గ్రాములు, ఎసిటామిప్రిడ్ లీటర్ నీటికి 0.2 గ్రాములు 15రోజుల కోసారి పంటపై పిచికారి చేస్తే పేనుబంకను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పడిగెల పీఏసీఎస్‌చైర్మన్ హన్మంతురెడ్డి, ఏఈవోలు ఎస్.సాయిరాంరాజ్, షేక్‌షబ్బీర్, ప్రశాంత్, రైతులు రాజముత్యం, రాజు, బోంబాయి గంగాధర్, జాన్, రాజేష్, లింగారెడ్డి, తదిరతులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకులు

ముప్కాల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా ఏసీ వాహనం ర్యాష్ డ్రైవింగ్‌తో విధులకు అటంకం కలిగిస్తున్నారని పోలీసులు ఇద్దరు యువకులను చితకబాదారు. దీంతో ఆ యువకులు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకోగా నిర్మల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనంలో ముప్కాల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ఆపకుండా వెళ్ళిపోవడంతో దొంగల ముఠా అనుమానంతో అప్రమత్తమైన పోలీసులు బాల్కొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికీ బాల్కొండలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు అప్రమత్తమై అపేందుకు ప్రయత్నించగా అపలేదు. కొద్దిదూరం వెంబడించి చివరికి షేక్ రహీం, అబ్దుల్ అఫీజ్‌లను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులను చితకబదడంతో తీవ్రగాయాలైనట్టు తెలిసింది. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ఇద్దరు యువకులను మొదట బాల్కొండ ఆసుపత్రి నుంచి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఇట్టి సంఘటనపై సీసీ పుటేజీలను అధారంగా తగు చర్యలు తీసుకుంటారని తెలిసింది.

గొంతు కోసిన వ్యక్తి అరెస్టు

నందిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఒకరి గొంతు కోసిన తెంగెన గణేష్ అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హజరు పరిచినట్లు ఎస్ఐ ఎం చిరంజీవి తెలిపారు. పాత కక్షల కారణంగా గణేష్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన తోట గంగమల్లు అనే వ్యక్తిని మందు తాగిస్తానని ఇంటికి పిలిచి, ఫుల్‌గా తాగించి, ముందుగానే ప్రథకం ప్రకారం దాచిన కొడవలితో గొంతు కోసినట్లు పోలీసులు తెలిపారు. నింధితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ ఎం చిరంజీవి చెప్పారు.

బెహరన్ జైల్లో మగ్గుతున్న తండ్రి కోసం ఎదురుచూపు

● 16ఏళ్లుగా బెహరన్‌లోనే కోడిచర్ల వాసి ● వైట్ పాస్‌పోర్టు కోసం ఎదురుచూపు



హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం వద్ద బాధిత కుటుంబసభ్యులు

మెండోర, జనవరి9(ఆంధ్రజ్యోతి): 16 ఏళ్లగా బెహరన్ జైల్లో ఉంటూ ఆరు నెలల క్రితం జైలు పాలైన నిజామాబాద్ జిల్లా మెండోర మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన కంచు గంగయ్య కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ సందర్భంగా గత నెల 24న ప్రవాసి ప్రజావాణిలో సీఎంరేవంత్‌రెడ్డి పేరిట వినతపత్రంసమర్పించగా ముఖ్య మంత్రి కార్యాలయం స్పందించి తగిన చర్యలు తీసుకుంది. గురువారం గంగయ్య కుటుంబసభ్యులు హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఆశ్రయిం చారు. బెహరన్ జైల్లో మగ్గుతున్న కంచు గంగయ్యకు ఇండియాన్ ఎంబాసి వైట్ పాస్‌పోర్టు జారీ చేయడం కోసం క్లియరెన్స్ ఇవ్వాలని గంగయ్య కూతురు శృతి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇమిగ్రాంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీమ్‌రెడ్డి మాట్లాడుతూ నెలలో గంగయ్య ఇండి యాకు వస్తాడని పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వెటర్నరీ సబ్ సెంటర్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన



నాళేశ్వర్‌లో స్థలాన్ని పరిశీలించిన జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ జగన్నాథ చారి

నవీపేట,జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో వెటర్నరీ సబ్ సెంటర్ ఏర్పాటు కోసం గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్నాథ చారి స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి పలువురు గ్రామస్థులు గ్రామంలో వెటర్నరీ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు జాయింట్ డైరెక్టర్ జగన్నాథ చారి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న గోపాలమిత్ర సెంటర్ సమీపంలో నూతనంగా సబ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో భారీ సంఖ్యలో పశు సంపద ఉన్నందున మండలంలోని బినోల వీఎల్‌వో పద్మావతిని వారంలో రెండు రోజుల పాటు నాళేశ్వర్‌లో పశువులకు వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు గంగాధర్ అయ్యర్, మాజీద్, నవీపేట పశువైద్య శాఖ అధికారి నరేందర్ రెడ్డి, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్‌లు సరిన్, నర్సింగ రావు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్, జనవరి9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఎక్సైజ్ కార్యాలయం లో పలు కేసులలో పట్టుబడ్డ రెండు ద్విచక్ర వాహనాలను నేడు వేలం వేస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఉదయం 11గంటల లోపు 25శాతం అప్సెట్‌ప్రైజ్ జమ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరి హత్య

ఆర్మూర్‌రూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజామాబాద్‌రోడ్ టీచర్స్‌కాలనీలోని రోడ్డులో జగిత్యాల్ జిల్లా మల్లాపూర్‌లోని చెందిన మైలారం సోమేష్(60) ముగ్గురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల రోడ్డుపై ప్లాస్టిక్ డబ్బాలు, అట్టలు ఎరుకుంటూ జీవనం సాగిస్తున్న సోమేష్‌కు బుధవారం అర్ధరాత్రి సమయంలో గాజు సత్యనారాయణ, రవిలు డబ్బుల విషయమై సోమేష్‌తో గోడవపడ్డారు. దీంతో తాగిన మైకంలో ఉన్న సోమేష్‌ను బలమైన ఆయుధంతో కొట్టి చంపారు. విషయం తెలుసుకున్న ఎస్సై సోమేష్ పోలీస్‌సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నూసెన్స్ చేసిన వ్యక్తికి ఐదు రోజుల జైలు

జక్రాన్‌పల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి నూసెన్స్ చేసిన జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎం.సుమన్ అనే వ్యక్తికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఐదు రోజులు సాధారణ జైలు శిక్ష విధించారని ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపారు. గురువారం ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లికి చెందిన ఎం.సుమన్ మద్యం తాగి నూసెన్స్ చేయగా ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరుపర్చగా ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

సాలూర,జనవరి9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సాలూర తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని అంగన్‌వాడీ స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బోధన్‌రూరల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పీఎల్‌వీ పద్మానింగ్ అన్నారు. న్యాయవాది కళ్యాణి, డీఎల్‌సీఏ నిజామాబాద్‌తో కూడిన బృందం మధ్యాహ్న సమయంలో బోధన్ పట్టణంలో ప్రభుత్వ పాఠశాల జేసీని సందర్శించారు. పర్యటనలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రమైన చక్కటి ఆహారాన్ని అందిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆహారంలో గల నాణ్యతతో పరిశీలించామన్నారు. విద్యార్థులకు కలిసి భోజనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ రమణ, సునీత తదితరులున్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు భవనం పరిశీలన



వీడీసీ సభ్యులతో మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి

ఏర్గట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ గ్రంథాలయ ఏర్పాటు లో భాగంగా గురువారం జిల్లా గ్రంథాలయ చైర్మర్ రాజారెడ్డి గ్రామాభివృద్ధి కమిటీకి సంబంధించిన భవనాన్ని పరిశీలించారు. మండలంలోని కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి మేరకు గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెంటాఖుర్దు క్యాంప్ శివారులో బుధవారం అర్ధరాత్రి కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి గణేష్(27)అనే వ్యక్తి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుడు బోధన్ పట్టణంలోని హోటల్‌లో రోజువారి కూలీగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతుడి తల్లి జక్కుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,జనవరి9(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోస్లీకి చెందిన రాంజీ లక్ష్మణ్(43)అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు.లక్ష్మణ్‌కు గతకొంతకాలంగా మానసిక స్థితి బాగాలేదని పైగా ఇటీవల తనఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు పెరిగిపోయ్యాయని అన్నారు. జీవితంపై విరక్తి చెందిన తన పొలం సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు జరిమాన

రుద్రూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రం లోని బస్టాండ్ సమీ పంలో రుద్రూర్ ఎస్సై సాయన్న తన సిబ్బంది తో బుధవారం రాత్రి వాహనాలను తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని గురువారం ఉదయం బోధన్‌కోర్టులో హాజరుపరుచగా, సెకండ్‌క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులు టేకేవార్ మనోజ్ రూ.12 వేల, మొషినే అంజిబాబు రూ.3వేల, బైండ్ల సాయిలు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.


మాట్లాడుతున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్

రైతన్నల పెద్ద పండుగ.. సంక్రాంతి


● ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్

బోధన్‌రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతన్నల పెద్ద పండుగ సంక్రాంతి అని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, ఇందూర్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగను ప్రతిబింబించే విధంగా సంక్రాంతి శోభ ఉట్టిపడేలా పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. సంక్రాంతి రైతులకు పెద్ద పండుగ అని ఆయన కొనియాడారు. విద్యార్థులు సాంస్కృతిక సంప్రదాయాలపై ఎప్పటికీ మక్కువతో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో గ్రామీణస్థాయి వాతావరణంలో భాగంగా మంచినీళ్ల బావి, పూరిల్లు, రంగురంగులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ పావులూరి సుధారాణి, విద్యావికాస్ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాస్ రావు, ప్రైవేటు విద్యాసంస్థల బోధన్ అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ, పాఠశాలల ప్రతినిధులు జయప్రకాష్, సురేష్, లయన్స్ ప్రతినిధి శ్యాంసుందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


విజయ్ హైస్కూల్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్ లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ, పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత దివాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


శంఖు చక్రనామాలు

భక్తి


విద్యుత్ దీపాలంకరణలో జెండాబాలాజీ మందిరం

పుణ్యప్రదాయిని.. వైకుంఠ ఏకాదశి

● వైకుంఠం నుంచి భువిపైకి భక్తుల దర్శనార్థం ● ఉత్తర ద్వారా దర్శనం ద్వారా మోక్షం ● ముస్తాబైన ఆలయాలు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహా విష్ణువుకు ప్రీతికరమైన ఏకదశులలో పుణ్యప్రదమైన ఏకాదశిగా వైకుంఠ ఏకాదశిని భక్తులు భావిస్తారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠం నుంచి భక్తుల దర్శనార్థం స్వామి ఉత్తర దర్శణం ద్వారా దర్శణం ఇస్తారు. ఈ రోజున శ్రీవైష్ణవ ఆలయాల్లో విష్ణు స్వరూపమైన స్వామిని ఉత్తరద్వారం ద్వారా దర్శించుకోవడంతో మోక్షం లభిస్తుందని శాస్త్రం చెబుతుంది. ఏడాది పొడుగునా వచ్చే ఏకాదశుల్లో మహావిష్ణువుకి ప్రీతికరమైన ఏకాదశి వైకుంఠ ఏకాదశిగా పేరుంది. ఈ రోజున ముక్కోటి దేవతలు యోగ నిద్రలోంచి లేచిన శ్రీమహావిష్ణువును దర్శించుకోవడం ద్వారా భక్తులు ముక్కోటి దేవతలను దర్శించుకున్న ఫలితం వస్తుందని నమ్ముతారు. ఉపవాసాన్ని పాటిస్తూ భగవత్ ఆరాధన సాన్నిహిత్యంలో ఉండడం భగవత్‌భజన భక్తి పాటలను పాడడం ఏకాదశి వ్రతంలో అతి ముఖ్యంగా భావిస్తారు. సంవత్సరంలో వైకుంఠ ఏకాదశి ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకదశి రోజున విశేషమైన రోజుగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ముస్తాబైన ఆలయాలు..

వైకుంఠ ఏకదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు వైకుంఠ ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని సంప్రదాయం ఉండడంతో అందుకనుగుణంగా ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను మామిడితోరణాలు, వైకుంఠ ఉత్తర ద్వారం, అందరికి కనిపించే విధంగా ఉత్తరద్వారాన్ని పూలు, మామిడితోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. ఆలయం చుట్టూ శంకుచక్రనామాలు, ఆయా దేవాలయాల దేవతామూర్తుల లైటింగ్, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఉపవాస దీక్షను చేపడ్తుండడంతో ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా ఆరోగ్యశాఖ అధ్వర్యంలో సిబ్బందిని అందుబాటులో ఉంచారు. భక్తులు ఉదయం నుంచే అర్ధరాత్రి వరకు దర్శించుకునే వీలుగా వాలంటీర్లను క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పండ్లు, ప్రసాదాలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ దేవాలయమైన జెండా బాలాజీ మందిర్, సుభాష్‌నగర్ లోని రామాలయం, ఖిల్లా రఘునాథాలయం, అయ్యప్ప దేవాలయంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, శివాజీనగర్‌లోని శ్రీకృష్ణమందిరం, ఆర్యనగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం, చక్రంగుడి వేంకటేశ్వరాలయం, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, ఇందల్‌వాయి రామాలయం, గంగాస్థాన్ ఫేస్-2లోని ఉత్తర తిరుపతి క్షేత్రం,కంఠేశ్వర్‌లోని మురళీకృష్ణ ఆలయం, భీంగల్ లక్ష్మీనర్సింహాదేవాలయం, అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయం, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వర ఆలయం, జాన్కంపేట్ నర్సింహాస్వామి ఆలయం, బోధన్ వెంకటేశ్వరస్వామి ఆలయం, శక్కర్‌నగర్ రామాలయం, గుండారం రామాలయం, సారంగపూర్ రామాలయం, శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు రామాలయం, తదితర ఆలయాలు ముక్కోటి ఏకాదశికి ముస్తాబయ్యాయి.


విద్యుత్ దీపాలతో వెంకటేశ్వరస్వామి

సంక్రాంతి సెలవులకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త!

● ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ



ఖిల్లా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సెలవులకు దూరప్రాంతాలకు ప్రయాణాలు చేసే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ సూచించారు. , ఇంటికి తాళం వేసి వెళ్లే వారు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమారాలు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించే కొత్తవారు తమ చేతివాటం చూపడానికి ఇదే మంచి అవకాశంగా భావిస్తాంచి చేతి వాటం ప్రదర్శిస్తారని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పలు చర్యలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో సంక్రాంతి పండుగ ఉన్నందున దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయని, వాటిని నియంత్రించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. రాత్రి వేళల్లో సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలనీల్లో నేరాల నియంత్రణపై సిబ్బందిని అప్రమత్తం చేసి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పరుధుల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబరు, ఎప్పుడు తిరిగి వస్తున్నారు. ఇంటిలో విలువైన వస్తువులు ఏమి లేవు లాంటి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్‌లోని రిజిష్టర్‌లో నమోదు చేసుకుని వెళ్లాలన్నారు. ఇలా చేయడం వల్ల ఊరెళ్లిన వారి ఇళ్లను రాత్రి వేళ నిఘా వేస్తామన్నారు. అనుమానస్పదంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీ టీవీలు ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించడం జరిగిందన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు పెట్టిన బీరువా తాళాలు మాత్రం తమతో తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనిపించకుండా ఉండేందుకు దానిపై కర్టెన్ వేయాలన్నారు. శివారు ప్రాంతాల కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ గుర్తించడం, రాత్రివేళ చోరీకి పాల్పడతారన్నారు. అలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామాలకు వెళ్లే వారు ఇంటి లోని ఓ గదిలో లైట్ వేసి వెళ్లాలన్నారు. ఇంట్లో కుటుంబసభ్యులు వెళ్లాక ఇంట్లో మహిళలు,వృద్దులు అపరిచుతులు సమాచారం పేరుతో వస్తే నమ్మొద్దన్నారు. ఇంట్లో లేని సమయంలో పాల ప్యాకెట్లు, దినపత్రికలు జమ కాకుండా చూడాలి, దీని వల్ల కూడా నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశాలుంటాయి. ఇంటి భద్రతా పరంగా ఇంటికి ధృడమైన నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ సెక్యూరిటీ లాక్ సిస్టంను వాడడం మంచిది. సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచె భద్రత ఉంటుందన్నారు. ఇంట్లో, ఇంటి బయట మోషన్ సెన్సర్ లను ఉపయోగించడం మంచిది. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించడం కూడ నేరాల నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. సెన్సార్ల పరిసరాల్లో ఏదైనా కదలిక గుర్తిచగానే లైట్ వెలుగుతుందన్నారు. సాధరణంగా సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఇండ్లు, చీకటి ప్రదేశం, పాత గ్రిల్స్ బలహీనమైన తాళాలు ఉన్న ఇండ్లలో దొంగలు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలి, ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి.పోలీసు స్టేషన్ నంబర్‌తో పాటు వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నంబర్‌ను దగ్గర పెట్టుకోవాలన్నారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే దొంగతనాలను నియంత్రించడం జరుగుతుందన్నారు. కాలనీల్లో సంచరించే అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటువంటి వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీల్లో దొంగతనాల నియంత్రణకు కాలనీ కమీటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఇరుముడితో శబరిమలైకి
బయలుదేరి వెళ్లిన అయ్యప్ప స్వాములు


కొడిచిరా నుంచి ఇరుముడితో బయలుదేరిన అయ్యప్ప స్వాములు

మద్నూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల మండల దీక్ష (41 రోజులు) అనంతరం ఇరుముడి కట్టుకొని మణి కంఠుడి దర్శనార్థం కేరళ రాష్ట్రంలోని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. పల్లె నుంచి పట్టణం వరకు అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపట్టిన భక్తులు వారి కుటుంబ సభ్యులచే ఆలయాల్లో పూజలు, ఇరుముడులతో సందడి వాతావరణం నెలకొంది. కార్తీక మాసం ప్రారంభం నుంచి మకర సంక్రాంతి పూర్తయ్యే వరకు అయ్యప్ప స్వాముల దర్శనం శబరిమలలో నిరంతరం కొనసాగుతుంది. స్వాములు దీక్ష విరమించే వేల ఇరుముడి తప్పనిసరిగా కట్టుకుంటారు. స్వామి సన్నిధానం చేరుకున్న తర్వాతే ఈ ఇరుముడిని విప్పుతారు. దేవుని ఆత్మ పరమాత్మలను అనుసంధానం చేయడమే ఇరుముడిలోని ఆంతర్యమని పండితులు చెబుతున్నారు. భక్తి, శ్రద్ధ అనే రెండు భాగాలు కలిగిన ఇరుముడిలోని తొలిభాగంలో కొబ్బరికాయలోని నీటిని తొలగించి పూర్తిగా నెయ్యితో నింపుతారు. పూజా సామాగ్రి పెడతారు. రెండో భాగంలో స్వాముల ప్రయాణానికి కావాల్సిన బియ్యం ,పప్పు, పసుపు, కుంకుమ వంటివి పెడతారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల్లో కన్నెస్వాములు, గురుస్వాములు ఇరు ముడితో 18 మెట్ల గుండా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. ద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం, మద్నూర్ మండలం కొడిచిర గ్రామం నుంచి అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలకు బయలుదేరివెళ్లారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థి ఎంపిక

ముప్కాల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీల్లో ముప్కాల్ మండలం రెంజర్ల పాఠశాలకు చెందిన అంకిత పాల్గొన్నట్టు ఎంఈవో జక్కుల రవికుమార్ తెలిపారు. సహజ పద్ధతిలో ఆహార పదార్థాలు పురుగు పట్టకుండా నిల్వ చేసే అంశంపై దక్షిణ భారతస్థాయిలో జరిగే విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైంది. జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు పాఠశాల విద్యార్థిని అంకిత ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శన ఇస్తున్న అంకిత


గేవర్



సంక్రాంతి స్పెషల్


గేవర్ తయారు చేస్తున్న దృశ్యం

నోరూరిస్తున్న రాజస్థానీ గేవర్

సంక్రాంతి అంటే తెలుగు ప్రజలకు ప్రత్యేకం ఎలాగో రాజస్థానీ, గుజరాతీ వాసులకు కూడా అంతే ప్రత్యేకం. నిజామాబాద్ జిల్లాకు వ్యాపారం కోసం వచ్చి ఇక్కడే స్థిరపడ్డ ఉత్తరాది తీపి వంటకాలంటే చాలా ఇష్టం. గేవర్ అంటే తెలంగాణ వాసులకు పరిచయం లేని తీపి పదార్థం. కొన్నేళ్లుగా జిల్లా వాసులను సైతం నోరూరిస్తుంది. సంక్రాంతి పండుగ వస్తే తెలుగు వారికి పిండి వంటలు ఎంత ప్రాముఖ్యత ఉందో రాజస్థానీలకు గేవర్ స్వీట్ అంత ప్రాముఖ్యమైంది. జిల్లాకేంద్రంలో రాజస్థానీ కుటుంబాలు ఉండడంతో ఇక్కడ కొందరు వ్యాపారులు ప్రత్యేకంగా ఈ స్వీటును తయారు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ గేట్ పక్కనే ఉన్న గణపతి దేవాలయం వద్ద రాజు అనే వ్యాపారి గాయత్రీ ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా తయారు చేస్తున్నాడు. సంవత్సరంలో కేవలం జనవరి 1 నుంచి 15 వరకు మాత్రమే లభిస్తుంది. ఉత్తరాది వారు తమ బంధువులకు ఈ ప్రత్యేక మైన స్వీట్లను బహుమతిగా ఇస్తుంటారు. నెయ్యితో తయారు చేసే ఈ స్వీటు అంటే రాజస్థానీలకు భలే ఇష్టం. జిల్లాకేంద్రంతో పాటు నిర్మల్, అదిలాబాద్, బాసర, భైంసా, నాందేడ్ ప్రాంతాల నుంచి కూడా ఈ గేవర్ కోసం వస్తుంటారు. ఈ సీజన్‌లోనే సుమారు 5 నుంచి 10 క్వింటాళ్ల గేవర్‌ను విక్రయాలు సాగుతాయి. నెయ్యితో తయారు చేసిన స్వీటు 600ల రూపాయలు, మా మూలు స్వీటు 400 రూపాయలకు విక్రయిస్తున్నారు. వీటితో పాటు కేసరి పేని, నువ్వుల గజక్ రోల్, తిల్లీ పాపడ్, గజక్ లాంటి వెరైటీ స్వీట్లను వీరు తయారు చేసి విక్రయిస్తున్నారు. సాంప్రదాయ వంటకంగా ఉండే గేవర్‌తో పాటు అనేక వంటకాలను జిల్లా వాసులకు వీరు రుచి చూపిస్తున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


పేణీలు

తిల్లీ చెక్కీ

తిల్లీ పాపడ్

గజక్

బహిరంగ ప్రకటన

ICICI Bank
నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను జనవరి 20, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ. 12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆరేపేట	
220005002014	ఎర్ర శ్రీనివాస్
శాఖ పేరు: ఆర్మూర్	
069505011863	జక్కుల సుజాత
069505011908	దేవక్క సౌందర్య
069505012433	ఓటర్పర్ పద్మ
శాఖ పేరు: భైంసా	
395505004068	మంతెన వెంకట రెడ్డి
395505004371	ముత్యం రెడ్డి బెజ్జంకి గంగవ్వ
395505005885	శ్రీనివాస్ మోర

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631205037350	కువ్వరమోని సుమంత్ యాదవ్
శాఖ పేరు: హైదరాబాద్- లిబర్టీ క్రాస్ రోడ్	
386705001259	నోటి మోహన్ రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- మూసాపేట	
111605002368	యనమల ఆనంద్
శాఖ పేరు: హైదరాబాద్- నల్లకుంట	
037005008456	బుర్ర మురళీ
శాఖ పేరు: హైదరాబాద్- పంజాగుట్ట	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: నాగర్‌కర్నూల్	
377705007093	ఖాసీమ్ బాషమోని
శాఖ పేరు: నకిరేకల్	
380005005812	శంకర్ రావుల
380005006169	గుండు నాగరాజు
380005006265	ఆలకుంట్ల వెంకటేష్
శాఖ పేరు: నల్గొండ	
059905009148	కొల్లు మధు
శాఖ పేరు: నందిగామ	
223205002678	పెద్దపైడి ప్రార్థన
223205002718	పెద్దపైడి ప్రార్థన
223205001579	[illegible]



పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కామారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో గల మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ బాలికల పాఠ శాలను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలి ంచారు. ఈ సందర్భంగా వంటగదిలోని వస్తువులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనం తరం వార్డులో బోరుమోటార్‌ను ప్రారంభించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏడుస్తూ ఉన్న చిన్నారులను గమనించి ఎక్కడి వారనేది ఆరా తీశారు. చిన్నారులు ఎలాంటి విషయాలు చెప్పకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలోకి తీసుకుని వస్తుండగా ఆమె తల్లి అక్కడికి వచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసింది. తాము దోమకొండ మండల అంచనూర్ నుంచి వచ్చామని ఆధార్ కేంద్రానికి రాగా, పిల్లలను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కూర్చోబెట్టి మీసేవా కేంద్రానికి వెళ్లానని తెలుపడంతో పిల్లలను ఆ విధంగా విడిచి వెళ్తే ఎలాగని తల్లిని ప్రశ్నించారు. అనంతరం పిల్లలను ఆమెకు అప్పగించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నసురుల్లాబాద్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సున్నంసాయిలు మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి, రెండవ, తృతీయ బహుమతులు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నిజాంసాగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల దుకాణాలను జీఎస్‌ఆర్ పార్టీ ఎరువుల గోడౌన్లను మంగళవారం నియోజకవర్గంలోని బిచ్కుంద డివిజన్ సహాయ సంచాలకులు ఇంద్రసేన్ తనిఖీ చేశారు. ఎరువుల గోదాముల్లో నిలువ ఉన్న ఎరువులను నిలువలను పరిశీలించారు. రైతుల అవసరాలను బట్టి ఎప్పటికప్పుడు ఎరువుల కొరత లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. మల్లూరు విండోలు ఎరువుల విక్రయ రికార్డులను జీఎస్ఆర్ ఫ్యాక్టరీలో ఉన్న ఎరువులను రిజిష్టర్‌ను పరిశీలించారు. ఆయనవెంట వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ ఎరువుల విక్రయదారులు ఉన్నారు.

మైనారిటీ గురుకులంలో ఫాతిమాషేక్ జయంతి

ఎల్లారెడ్డి, జనవరి9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి ప్రిన్సిపాల్ మహ్మద్ రఫత్ ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఫాతిమా షేఖ్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎల్సీ బాలరాజ్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్,మాంజూర్‌ఖాన్, నాగరాజు, దత్తాత్రేయ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలి

తాడ్వాయి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల సంఖ్యను తక్షణమే పెంచాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ సూచించారు. ఈయన బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల పునర్ పరిశీలన చేశారు. గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలను అధికారులు గుర్తించి లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు. ఇందులో సూపరిండెంట్ హన్మాండ్లు, ఇన్‌చార్జి ఏపీవో కృష్ణగౌడ్ ఉన్నారు.

లింగంపేట్‌లో ఒకరి అదృశ్యం

లింగంపేట, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన బండి నర్సింలు ఈనెల 8న బుధవారం పశువులను సమీపంలోని మల్లారం అడవిలోకి మేతకు తీసుకువెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. నర్సింలు బుధవారం ఉదయం 11 గంటలకు పశువులను తీసుకుని మల్లారం అటవీ ప్రాంతంలో మేతకు తీసుకువెళ్లాడు సాయంత్రం పశువులు ఇంటికి తిరిగివచ్చినా నర్సింలు రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు గ్రామంలోను బంధువుల వద్ద, అటవీ ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని బడిలో చేర్పించిన అధికారులు

నిజాంసాగర్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించాలనే స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. సుల్తాన్ నగర్ గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఇదే గ్రామానికి చెందిన అందాల అర్జున్ ఏడో తరగతిలో బడిమానేసి ఇంటి వద్ద ఉంటున్న బాలుడిని గుర్తించారు. అధికారులు సర్వే చేయగా అర్జున్‌ను బడిలో చేర్పాలని విద్యార్థి తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. దీంతో అర్జున్‌ను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రవేశం కల్పించారు. ప్రతీరోజు అర్జున్‌ను పాఠశాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, సీఆర్పి నరసింహులు ఉన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, SOMARTI GANGA SHEKHAR (OLD NAME), R/O H.NO. 4-34, BORGAON (P), NIZAMABAD DISTRICT - 503230, T.G, INDIA HAVE CHANGED MY NAME AS SOMARTHI GANGA SHEKAR (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, SABIYA BEGUM W/O SYED RAHEEMUDDIN R/O H.NO: 5-5, BINOLA, NAVIPET, NIZAMABAD, TG. I HAVE CHANGED MY CHILD NAME FROM SAYAD ZAIN SIDDIQ (OLD NAME) TO SYED ZAIN SIDDIQ (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, BOINAPALLI RAVINDER (OLD NAME), H.NO. 6-1, (V) UPPAL, (M) KAMALAPUR, (DIST)-HANMAKONDA T.G. PIN CODE-505101, HAVE CHANGED MY NAME AS BOINAPALLY RAVINDER RAO S/O BOINAPALLY SUDHAKAR RAO (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, BOINAPALLI SUDHAKER (OLD NAME), H.NO.6-1, (V) UPPAL, (M) KAMALAPUR, (DIST). HANMAKONDA, T.G. PIN CODE-505101, HAVE CHANGED MY NAME AS BOINAPALLY SUDHAKAR RAO S/O RAJESHWAR RAO (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, SABIYA BEGUM W/O SYED RAHEEMUDDIN R/O H.NO:5-5, BINOLA, NAVIPET, NIZAMABAD, TG. I HAVE CHANGED MY CHILD NAME FROM ZAINAB SIDDIQUI (OLD NAME) TO ZAINAB SIDDIQA (NEW NAME)

AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

-: సంప్రదించవల్సిన నెంబరు :-

కామారెడ్డి : 9985411453

యూరియా కొరత లేకుండా చర్యలు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్



బీర్కూర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి



అధికారులతో మాట్లాడుతున్న అధికారి తిరుమల ప్రసాద్

నసురుల్లాబాద్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగుకు రైతులకు అవసరమైన యూరియా సిద్ధం చేయాలని, కొరత చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దుర్కి, నసురుల్లాబాద్ సహకార సంఘాలను అకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాములలో నిలువ ఉన్న యూరియా, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, యూరియా స్టాక్ ఎంత ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఆయన వెంట ఏవో భవాని, దుర్కి సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, ఏఈఓలు గోపాల్, సాయి సుమన్, సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

బీర్కూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల, ఎరువుల మందుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేని మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన బీర్కూర్ మండలంలో పర్యటించారు. బీర్కూర్, దామరాంచ గ్రామాలలో సహకార సంఘాలను సందర్శించి యూరియా నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత ఏర్పడక ముందే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొరత ఏర్పడకుండా యూరియాను సరఫరా చేస్తానన్నారు. రైతులకు అవసరం మేరకే యూరియా బస్తాలు అందించాలన్నారు. అవసరానికి మించి అందిస్తే ఎరువులు వృధా అవుతాయన్నారు. ఎకరాకు ఎంత మేర యూరియా వినియోగించాలి, ఎక్కువ వినియోగిస్తే కలిగే దుష్పరిణామాల గురించి రైతులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏవో కార్తీక్, ఏఈవోలు అనుష, మీనా, తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన జిల్లా సైన్స్ ప్రాజెక్ట్

కామారెడ్డి టౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్‌మానక్ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్‌అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ మండలం అచ్చంపేట మోడల్ స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి ఆకాష్ రూపొందించిన విత్తనాలు నాటే యంత్రం జాతీయస్థాయికి ఎంపిక అయిందని తెలిపారు. రాష్ట్ర వైద్య,సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ సైతం విద్యార్థిని అభినందించారని తెలిపారు.ఈ ప్రాజెక్ట్‌కు గైడ్ టీచర్‌గా జైపాల్ వ్యవహరించాడని తెలిపారు. ఈయంత్రం సహాయంతో అన్ని రకాల విత్తనాలు సులభంగా నాటవచ్చని తెలిపారు.

రోడ్డుభద్రత మాసోత్సవాలపై అవగాహన

సదాశివనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీకళాశాలలో జాతీయ రోడ్డుభద్రత మసోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సంతోష్‌కుమార్, ఎంవీఐ మహేష్ రోడ్డుభద్రత, ట్రాఫిక్ రూల్స్, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అక్టోబరులో నిర్వహించిన వ్యాసరచన పోటిలకు సంబంధించి శ్రీవాసవి, ప్రవళిక, చైతన్యలు ప్రతిభ కనభరచడంతో వారికి బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్,ప్రిన్సిపల్ శోభారాణి,వైస్ ప్రిన్సిపల్ మీనా, శ్రావణి, అకాడమిక్ కోఆర్డినేటర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

'పోరుబాట పాదయాత్రకు రైతులు తరలిరావాలి'

తాడ్వాయి, జనవరి9 (ఆంధ్రజ్యోతి): రైతుల పోరుబాట పాదయాత్రకు మండలంలోని రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని మండల సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. ఈయన గురువారం పలు గ్రామాల్లో పర్యటించి తాడ్వాయి మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ భవనం వరకు రైతుల పోరుబాట కార్యక్రమానికి తరలి రావాలని ఆయా గ్రామాల రైతులకు సూచించారు. ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి గద్దె నెక్కిందని అన్నారు. రైతులకు చేయవలసిన రుణమాఫీని పూర్తిగా చేయాలని తెలిపారు. సకాలంలో విజయ డైరీ బిల్లులు పడడం లేదని, దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముదాం నర్సింలు, ధర్మారెడ్డి, గంగారెడ్డి, మంగారెడ్డి, రమేష్ రావు, సంజీవులు, సాయిరెడ్డి, రాములు, చంద్రయ్య, తదితరులు ఉన్నారు.

చైనా మాంజ అమ్మితే చర్యలు: ఎస్పీ

కామారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైన చైనామంజా అమ్మినా, తమ వద్ద కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సింధూశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ దుకాణంపై సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 65 బెండల్స్ చైనా మంజాను సీజ్ చేసినట్లు తెలిపారు. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మంజాను ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,నైలాన్,సింథటిక్ దారాలతో తయారుచేసే ఈ మంజాలతో పర్యవరణానికి హాని కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరీరక్షణ చట్టం 1986 ప్రకారం చైనామంజా అమ్మిన కొనుగోలు చేసినా నేరమేనని, ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా ఉంటుందని తెలిపారు. ఎవరైనా చైనా మాంజ అమ్మితే 8712686112 అనే నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగారాష్ట్ర డీజీపీ జితేందర్ ఈక్యూఆర్‌కోడ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి ఫిర్యాదులు, ఎఫ్ఆర్, ఈచలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజ లు పోలీసుసేవల పట్ల తమఅభిప్రాయాలు తెలుపవచ్చని అన్నారు. ప్రతీ పోలీసుస్టేషన్‌లో ప్రజలకు సులభంగా కనిపించేవిధంగా రిసెప్షన్ సెంటర్ వద్ద, స్టేషన్ హౌస్ అధికారి రూమ్‌నందు, ప్రజలు వేచి ఉండే గదిలో, బయట ప్రవేశ ద్వారం వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపారు.

చైనా మాంజ నిషేధం..

ఎల్లారెడ్డి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చైనా మాంజ నిషేధమని, ఎవరైనా విక్రయించినా, విని యోగించినా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని దుకాణాలను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సంక్రాంతి సందర్భంగా చిన్నపిల్లలు, పెద్దలు సరద కోసం ఎగరవేసే పతంగులకు నైలాన్, సింథటిక్‌తో తయా రు చేసినా చైనా మాంజ వాడి పడేయడంతో ప్రజలకు, పక్షులకు ప్రమాదాల వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఎస్సై మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చైనా మాంజ విక్రయాలు, వినియోగాలపై ప్రత్యేక దృష్టిపెట్టామని, ఎవరైనా నిల్వ ఉంచినా, తయారుచేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామ ని తెలిపారు. ఎవరైనా అమ్మితే డయల్ 100కి లేదా పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించగలరని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

చైనా మాంజ విక్రయిస్తే కేసులు: ఎస్సై

పెద్దకొడప్‌గల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): చైనామాంజ విక్రయిస్తే కేసు లు నమోదు చేస్తామని జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ హెచ్చరించారు. గురు వారం మండలకేంద్రంలో గాలిపటాలు విక్రయిస్తున్న దుకాణాలతో పాటు కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నిషేధం విధించిందని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన చైనామాంజను దుకాణదారులు విక్రయించరాదని, ఒకవేళ ఎవరైనా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నెమలి సాయి ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులుసాయి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమలిసాయి ఆలయం మినీషిరీడిగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్

బాన్సువాడ,జనవరి9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబేర్ డిమాండ్ చేశారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. రైతుభరోసా కింద 15 వేలు ఇస్తానని చెప్పి 12వేలు ఇస్తామనడం సీఎం రేవంత్‌రెడ్డిని రైతులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోచి గణేశ్, ఎర్రవటి సాయిబాబా, రమేశ్ యాదవ్, గౌస్, మహేశ్, దత్తు తదితరులు పాల్గొనారు.



పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడను జిల్లాకేంద్రంగా ఏర్పాటు చేయాలి

బాన్సువాడను జిల్లాకేంద్రంగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బీఆర్ఎస్ నాయకులు జుబేర్ డిమాండ్ చేశారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాసుల బాలరాజ్ బాన్సువాడ జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ఆగ్రో చైర్మన్ పదవిలో ఉన్న కాసుల బాలరాజ్ వెంటనే బాన్సువాడను జిల్లా కేంద్రం ఏర్పాటు చేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, ఇద్దరూ కలిసి బాన్సువాడను జిల్లాకేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, మహేష్, సాయిబాబా రమేష్, మౌలసాయిలు, తదితరులున్నారు.

జిల్లాలో నకిలీ వైద్యుల కలకలం

(3వ పేజీ తరువాయి)

లేకపోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

వైద్యఆరోగ్యశాఖ తనిఖీలలో ఎందుకు గమనించడంలేదు?

నెలవారిగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఆయా ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న సమయంలో ఇలాంటి నకిలి వైద్యులను ఎందుకు గమనించడం లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత రెండెండ్లుగా ఓ నకిలి వైద్యుడు చిన్నపిల్లల వైద్యుడిగా పనిచేస్తున్నా పట్టించుకోకపోవడంపై ఏ స్థాయిలో తనిఖీలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కనీసం డిగ్రీ పట్టాలేని వైద్యుడు ఒక ఆర్ఎంపీనో.. పీఎంపీ వద్దనో చికిత్సలు ఎలా ఇస్తారనేది గమనించి ఏకంగా నిపుణుడైన వైద్యుడి సర్టిఫికెట్‌కు నకల్ తయారు చేసి చిన్నపిల్లల వైద్యుడిగా కొనసాగుతున్నాడంటే కామారెడ్డి జిల్లా నకిలీ వైద్యులకు అడ్డాగా మారిందని చెప్పనక్కరలేదు. గతంలో బాన్సువాడతో పాటు ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నకిలీ వైద్యులను ఎన్ఎంసీ గుర్తించిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లాలో ఎంతమంది నకిలీ వైద్యులు ఉన్నారనేది పసిగట్టి ప్రజల ప్రాణాలకు హాని జరగకముందే వైద్యఆరోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేప పిల్లలఉత్పత్తి కేంద్రం పునర్నిర్మాణం అయ్యేనా?

(3వ పేజీ తరువాయి)

ఈకేంద్రాన్ని పట్టించుకునే పాపానపోవడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఉత్పత్తి కేంద్రం స్థలం ఆక్రమణలకు గురవుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రంలో ఉన్న కార్యాలయ భవనాలు సిబ్బంది, నివాసపు గదులు కూలిపోయాయి. ఉత్పత్తి కేంద్రంలో సిబ్బందివిధులు నిర్వహిస్తున్నారు. తప్ప ఎలాంటిచేప పిల్లల ఉత్పత్తి లేకుండాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వంరూ.3కోట్ల 50లక్షల నిధులు కేటాయించి ఉత్పత్తికేంద్రానికి పునర్నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.



మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్

లింగంపేట, జనవరి9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్ అన్నారు. గురువారం లింగంపేట మండలంలోని భవానిపేట, ఎక్కపల్లి, మాలోత్‌సంగ్యానాయక్ తండాలలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 8 మండలాల్లోనూ ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ గెలుచుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్ని గ్రామాలలోను కార్యకర్తలు కలిసి కట్టుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలని చెప్పారు. కష్టపడి పనిచేసిన వారికే స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు రాజు, ప్రసాద్‌గౌడ్, భైరయ్య, ఏదుల్, సాయికుమార్, గోవింద్‌సింగ్, నాన్య, రాంసింగ్, బలరాం, హరిచందర్, ఈశ్వర్‌గౌడ్, గోపాల్, గంగారెడ్డి, కాస సుధాకర్, కార్యకర్తలు ఉన్నారు.

త్వరలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ: ఆర్డీవో

ఎల్లారెడ్డి, జనవరి9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని సోమారిపేట్ బైపాస్ పక్కన నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను గురువారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి త్వరలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయనతోపాటు తహసీల్దార్ మహేందర్ కుమార్, కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శ్రీనివాస్, నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, పోచయ్య తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై ప్రణాళికలు

పెద్దకొడప్‌గల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డితో చర్చించినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో పోచారం స్వగృహంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువైపులా ఉన్న ఎమ్మెల్యేలు స్థానిక సంస్థలు జరగనున్న దృష్ట్యా రెండు నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రణాళిక చేశామని తెలిపారు. స్థానిక సంస్థలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. దీంతో పాటుగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

భిక్కనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ సమీపంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్థల పరిశీలనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సోలార్‌కుసుమ్ పథకంలో భాగంగా సోలార్ ప్రాంతం ఏర్పాటుకు కనీసం 4 ఎకరాల స్థలం అనువైనదిగా ఉంటుందని, ఈ స్థలం కేవలం రెండున్నర ఎకరాలు మాత్రమే ఉండగా మరోచోట స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేందర్, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

న్యాయ సహాయం, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● బాన్సువాడ కోర్టు న్యాయాధికారి కుమారి టీఎస్పీ భార్గవి

బాన్సువాడ, జనవరి9 (ఆంధ్రజ్యోతి): న్యాయ సహాయంపైనా, సేవలపైనా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించేలా నిర్వహించాలని బాన్సువాడ కోర్టు న్యాయాధికారి కుమారి టీఎస్పీ భార్గవి అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులతో సమీక్ష సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక సోమత లేని ఖైదీలకు న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలని న్యాయ సేవ సంస్థపై తెలుపాలని ఆమె సూచించారు. ప్రజలకు న్యాయసేవలపై న్యాయస్థానాలపై అవగాహన ఉండేలా అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఖలీల్, లక్ష్మీనారాయణ మూర్తి, మొగులయ్య, మోహన్ రెడ్డిలు తదితరులు ఉన్నారు.



కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న న్యాయాధికారి

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కపడా రోమాన్స్

దర్శన్ - యూఐ

ప్రియా 70 - పుష్ప-2

ప్రియా 35 - మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2

వెంకటేశ్వర - మ్యాక్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

